సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



పచ్చందాలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎటు చూసినా పొలాలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. 10లో



భక్తిశ్రద్ధలతో బోనాలు

కడ్తాల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో శని వారం కాటమయ్య బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 10లో

నేడు ప్రారంభోత్సవాలు

ఇబ్రహీంపట్నం: పంచాయతీ రాజ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలను ఇబ్రహీంపట్నంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రారంభించనున్నట్లు స్థానిక ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్ హాజరుకానున్నట్లు చెప్పారు.

‘భేరి’కి భారీగా..



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు

17న తుక్కుగూడ కేంద్రంగా కాంగ్రెస్ సభ

- హాజరు కానున్న సోనియా, రాహుల్, ఖర్గే, ఇతర ప్రముఖులు
- సభాస్థలి, ఏర్పాట్లను పరిశీలించిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- గ్రేటర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణకు కసరత్తు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తుక్కుగూడ కేంద్రంగా ఈ నెల 17న నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఓఆర్ఆర్‌కు సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కనీసం వంద మంది కూర్చునేలా ప్రధాన వేదిక సహా వీఐపీ గ్యాలరీలు, మహిళలు, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, బూత్‌లెవల్ ఏజెంట్లు, సాధారణ కార్యకర్తల కోసం ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన ప్రాంతాన్ని జేసీబీలు, డోజర్లతో చదును చేసే ప్రక్రియను ప్రారంభించారు. సభకు తరలివచ్చే ముఖ్య నేతలు, కార్యకర్తల వాహనాల పార్కింగ్ కోసం ఇటు రావిర్యాల వైపు, అటు శంషాబాద్ వైపు, కడ్తాల్ వైపు ఇలా వేదికకు నాలుగు వైపులా నాలుగు ప్రాంతాలను ఎంపిక చేశారు. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించే ఈ సభకు పది లక్షల మందికి తగ్గకుండా తరలించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పలువురు ఎంపీలు, ఆయా రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు సభకు హాజరుకానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా టార్గెట్లు

జనసమీకరణ కోసం నియోజకవర్గాల వారీగా నేతలకు టార్గెట్లు ఇచ్చారు. తుక్కుగూడకు ప్రవేశించే నాలుగు ప్రధాన రహదారుల్లో నాలుగు భారీ స్వాగత ద్వారాలతో పాటు ఇటు శ్రీశైలం జాతీయ రహదారి, అటు ఔటర్ సర్వీసు రోడ్ల వెంట భారీ కటౌట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం నేతలు దేప భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తదితరులు శనివారం సాయంత్రం సభాస్థలిని పరిశీలించారు. సభావేదిక సహా పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు.



తుక్కుగూడలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, స్థానికులు

స్థానికులకే ‘డబుల్’ ఇవ్వాలి

- తుక్కుగూడ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని శనివారం తుక్కుగూడలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని రైతుల భూముల్లో నిర్మించిన డబుల్ బెడ్రూంలను స్థానికులకు ఇవ్వకుండా మంత్రి సబితారెడ్డి నగరానికి చెందిన యాకత్‌పూర్, చార్మినార్, మలక్‌పేట, చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మజ్లిస్ నేతలు, మైనార్టీలకు కేటాయించారని విమర్శించారు. ఇక్కడ నిర్మించిన వాటిలో 2,400 ఇళ్లను స్థానికంగా ఉన్న నిరుపేదలు, ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కాకుండా ఒకే వర్గానికి కేటాయించడంలో పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. స్థానికులకు న్యాయం జరిగే వరకు ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధు మోహన్, మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, పలువురు కౌన్సిలర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తుల వెల్లువ



షాద్‌నగర్ టికెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు పలువురు నాయకులు అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, ఏపీ మిథున్‌రెడ్డి, కక్కునూరి వెంకటేష్‌గుప్తా, దేపల్లి అశోక్‌గౌడ్, చెట్ల వెంకటేశ్, ఎంకనోళ్ల వెంకటేశ్, మణికంఠ శనివారం తమ అనుచరులతో పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి దరఖాస్తులు సమర్పించారు.

అవకాశం ఇవ్వండి

కేశంపేట: షాద్‌నగర్, గజ్వేల్, కామారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్లలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. వైస్ ఎంపీపీగా గతంలో పని చేసినట్లు ఆయన దరఖాస్తులో పేర్కొన్నారు. బీసీ సామాజిక వర్గం తరఫున తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

అధిష్టానానికి దరఖాస్తు

కొందుర్గు: వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి బీజేపీ తరఫున పోటీచేయడానికి తనకు అవకాశం ఇవ్వాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల సర్పంచ్ భూపాలచారి శనివారం అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీకోసం చేసిన సేవలను వివరించారు.

15న రెండో విడత ‘డబుల్’ లక్కీ డ్రా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 15న హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. నియోజకవర్గానికి 500 మంది చొప్పున జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 13,300 మందిని ఎంపిక చేస్తామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన వారికి ఈ నెల 21న వేర్వేరు ప్రదేశాల్లో ఇళ్లను పంపిణీ చేస్తామని కలెక్టర్ వివరించారు.

నిమ్స్‌లో ‘వాలెట్ పార్కింగ్’

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగుల వాహనాలను నిర్ణీత పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేసేలా యాజమాన్యం చర్యలు చేపట్టింది. వాలెట్ పార్కింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు ప్రత్యేకంగా ఇద్దరు డ్రైవర్లను నియమించింది. రోగులు అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు పక్కనే వదిలిపెట్టే వాహనాలను తమ సిబ్బందే ఆయా పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేసే విధంగా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మీ భాస్కర్ తెలిపారు. దీని వల్ల ప్రాంగణంలో ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్క్ చేయకుండా కట్టడి చేసినట్టు అవుతుందని, అదే సమయంలో రోగులకు ఇబ్బంది కలగకుండా వాలెట్ పార్కింగ్ సిస్టంను ప్రవేశపెట్టామన్నారు. నిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే ఈ తరహా సేవలను అందిస్తున్నామని, ఈ సదుపాయాన్ని సద్వినియోగపర్చుకోవాల్సిందిగా కోరారు. ఉచిత రవాణా సదుపాయానికి మరో రెండు ఈ- కార్లు అందుబాటులోకి రానున్నట్టు లక్ష్మీభాస్కర్ తెలిపారు.

ఉత్సాహంగా అమెజాన్ రన్



ఖైరతాబాద్:‘రన్ ఫర్ చేంజ్’ నినాదంతో శనివారం పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన అమెజాన్ రన్‌లో ఔత్సాహికులు పాల్గొన్నారు. గివ్ ఇండియాతో కలిసి అమెజాన్ నిర్వహించిన 5 కిలోమీటర్ రన్‌ను భారతీయ మోడల్, ఫిట్‌నెస్ ప్రేమికుడు మిలింద్ సోమన్ జెండా ఊపి ప్రారంభించారు. సమాజానికి తిరిగి ఇవ్వడంలో ఉజ్వల భవిష్యత్తును సృష్టించాలనే తమ మిషన్‌లో భాగంగానే రన్ ఫర్ చేంజ్ నినాదంతో రన్‌ను నిర్వహించినట్లు అమెజాన్ ఇండియా, ఏపీఏసీ హెడ్ అనితా కుమార్ తెలిపారు.

రాజీ మార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జిలు

చేవెళ్ల: ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు ఇరువర్గాలకు రాజీమార్గమే రాజమార్గమని చేవెళ్ల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. చేవెళ్లకోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసుల సత్వర పరిష్కారం కోసమే ప్రత్యేకంగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజీ పడే అవకాశం ఉన్న అన్ని రకాల కేసులను వీటి ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. క్షణికావేశంలో జరిగిన గొడవలు, ప్రమాదాలతో కోర్టుల్లో కేసులు పెట్టికొని ఏళ్ల తరబడి తిరుగుతున్న వారు రాజీ మార్గంతో కేసులు లేకుండా చేసుకునే అవకాశం ఉందన్నారు. చేవెళ్ల కోర్టు పరిధిలో ఉన్న దాదాపు 3 వేల వరకు కేసులు ఈలోక్ అదాలత్ ద్వారా పరిష్కారం అయినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు జడ్జి సాంబశివరావు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు చంద్రశేఖర్, రామకృష్ణ, పాండురంగారెడ్డి, మల్లేశ్‌గౌడ్, జనార్దన్, కుమార్, గోపాల్, శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్, సుదర్శన్, రాజశేఖర్, గీత, సీఐలు లక్ష్మారెడ్డి, సైదులు, యాదయ్య, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి ప్రాధాన్యత

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్



మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా.ఆంజనేయగౌడ్ అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం జాతీయ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌-2023 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో క్రీడా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారని పేర్కొన్నారు. సినీనటుడు సుమన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి అద్భుతమని, పదేళ్లలో వందేళ్ల పురోగతి కనిపిస్తోందన్నారు. కరాటేతో ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఏ రంగంలోనైనా విజేతలుగా ఎదుగుతారన్నారు. మహిళల ఆత్మ రక్షణ కోసం విద్యార్థినులకు పాఠశాల స్థాయిలోనే సిలబస్‌లో కరాటేను చేర్చి,నేర్పించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.ప్రాచీన యుద్ధకళ అయిన కరాటేతో అనేక ప్రయోజనాలున్నాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. అనంతరం జాతీయ కరాటే పోటీల నిర్వాహకుడు, సినీహీరో విశ్వక్‌సేన్ తండ్రి గ్రాండ్ మాస్టర్ రాజును అతిథులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత సి.కళ్యాణ్, దైవజ్ఞశర్మ, చిన్న శ్రీశైలం యాదవ్, స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో పాటు వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

‘పట్నం’.. వారసత్వానికి దూరం

- ఇబ్రహీంపట్నంలో ఇప్పటికి కొనసాగింది 11 మంది ఎమ్మెల్యేలు
- రాజకీయాల్లోకి రాని ఏ ఒక్కరి వారసులు
- ఈసారి ప్రయత్నించినా కిషన్‌రెడ్డి తనయుడికి దక్కని అవకాశం



ఇబ్రహీంపట్నం ముఖచిత్రం

ఇబ్రహీంపట్నం: రాజకీయాలకు వారసత్వం కొత్తేమీకాదు. ఎంతోమంది తమ కుటుంబ సభ్యులతో ఎదిగినవారే. రాజకీయాల్లో ఒదిగినవారే. తల్లిదండ్రుల్లో ఎవరైనా ఎమ్మెల్యే, ఎంపీగా ఎదిగితే.. వారి కుటుంబ సభ్యుల్లో ఎవరినో ఒకరిని రాజకీయంగా ప్రోత్సహించడం సాధారణం. తమతోనే రాజకీయ ప్రస్థానం ముగిసిపోవద్దని వారసత్వ పరంపర కొనసాగాలని తపన పడుతుంటారు. అందుకు అనుగుణంగా పిల్లల రాజకీయ భవితకు నెమ్మదిగా బాటలు వేస్తుంటారు. దీనికి భిన్నంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాత్రం ఆది నుంచి వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తోంది. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 11 మంది ఎమ్మెల్యేలుగా కొనసాగారు. కుటుంబసభ్యుల్లో ఏ ఒక్కరూ వారి స్థానాలను భర్తీ చేసేందుకు రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకోలేదు.

- 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా ఇబ్రహీంపట్నం ఉండేది. కాంగ్రెస్ నుంచి ఎంబీ గౌతమ్, పీడీఎఫ్ నుంచి పిల్లాయిపల్లి పాపిరెడ్డి ఎమ్మెల్యేలు పనిచేశారు. వారి సంతానం ఎవరూ రాజకీయాల్లోకి రాలేదు.
- 1957, 1962, 1967లో మూడుసార్లు వరుసగా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా లక్ష్మీనర్సయ్య పనిచేశారు. ఆయన కుటుంబసభ్యులు రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- యాచారం మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన అనంతరెడ్డి 1972లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగగా ఆయన సంతానం రాజకీయాల్లోకి రాలేదు.
- అనంతరం ఈస్థానం ఎస్సీకి రిజర్వు కావడంతో 1978లో కాంగ్రెస్ నుంచి సుమిత్రాదేవి గెలిచారు. పదవీ కాలం ముగియకముందే అనారోగ్యంతో ఆమె కన్నుమూశారు. ఆమె కుటుంబ వివరాలు ఈ ప్రాంత ప్రజలకు తెలియదు.
- 1981, 1983లో జరిగిన ఉప ఎన్నిక, సాధారణ ఎన్నికల్లో రెండుసార్లు కాంగ్రెస్ తరఫున ఏజీ కృష్ణ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన కుమారుడు వారసత్వంగా ముందుకు రాలేదు.
- 1985లో టీడీపీ నుంచి గెలిచిన సత్యనారాయణ పరిస్థితి అంతే. కుటుంబ సభ్యులనెవరినీ ఆయన రాజకీయాల్లోకి తేలేదు.
- 1989, 1994లో రెండుసార్లు సీపీఎం తరఫున గెలిచిన కొండిగారి రాములుకు భార్య, ఇద్దరు కూమారులున్నారు. రాజకీయాలకు వారు దూరంగానే ఉన్నారు.
- టీడీపీ నుంచి 1999లో పుష్పలీల గెలిచి మంత్రిగా కొనసాగినా కుటుంబ సభ్యులెవరూ రాజకీయాల్లోలేరు.
- 2004లో సీపీఎం నుంచి గెలిచిన మస్కు నర్సింహకు భార్య, ఇద్దరు కుమారులున్నప్పటికీ వారు రాజకీయాల్లో ఆ స్థాయికి చేరుకోలేదు.

కిషన్‌రెడ్డి తనయుడికి దక్కని చాన్స్

జనరల్ కేటగిరీలోకి ఈ స్థానం మారిన అనంతరం టీడీపీ నుంచి 2009, 2014లో రెండుసార్లు, టీఆర్ఎస్ నుంచి 2018లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి కొనసాగుతున్నారు. ఆయన తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తండ్రి స్థానం నుంచి ఈసారి ఎమ్మెల్యే బరిలో దిగాలని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. టీడీపీ హయంలో సంతోష్‌నగర్ కార్పొరేటర్‌గా ఆయన పనిచేశారు. తండ్రి ఆశీర్వాదంతో ఈసారి ఎలాగైనా పోటీ చేయాలని భావించారు. నియోజకవర్గంలో ప్రగతి నివేదన పాదయాత్ర చేసి తండ్రికితగ్గ తనయుడిగా అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. అధిష్టానం ఇటీవల ఎమ్మెల్యే అభ్యర్థిగా కిషన్‌రెడ్డి పేరునే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇప్పటికీ దూరమే..

గత ఎమ్మెల్యేల, ఎంపీల వారసులెవరూ రాజకీయాల్లోకి వచ్చి నియోజకవర్గాన్ని శాసించిన దాఖలాలు లేవు. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఎంబీ గౌతమ్, పిల్లాయి పాపిరెడ్డి, లక్ష్మీనర్సయ్య, సుమిత్రాదేవి, ఏజీ కృష్ణ, సత్యనారాయణ స్థానికేతరులు కాగా అనంతరెడ్డి, కొండిగారి రాములు, కొండ్రు పుష్పలీల, మస్కు నర్సింహ, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్థానికులు. వారసత్వ రాజకీయాలకు ఈ నియోజకవర్గం ఇప్పటికీ దూరంగానే ఉండడం విశేషం.

గణపయ్యా.. కాస్త దిగి రావయ్యా!

- వినాయక విగ్రహాల ధరలకు రెక్కలు
- గతేడాది కంటే ఈసారి 20శాతం పెరుగుదల
- కనిష్టం రూ.45 వేలు.. గరిష్టం రూ.3 లక్షలు
- ధూల్‌పేట్, ఎల్‌బీనగర్, నాగోల్, మియాపూర్‌లో విక్రయాలు
- చవితికి వైవిధ్యభరిత ప్రతిమలు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: పది అడుగుల ఎత్తు వినాయక విగ్రహం ధర రూ.45 వేలు. ఇంకొంచెం ఆకర్షణీయంగా ఉంటే రూ.50 వేలు. 18 అడుగుల గణనాథుడు రూ.2 లక్షల పైనే ఉన్నాడు. ఇక 25 ఫీట్ల మూర్తిని మండపంలో ఏర్పాటు చేయాలంటే రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు చెల్లించి కొనుగోలు చేయాల్సిందే. ఈసారి గణనాథుడి విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని అనేక చోట్ల విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం భగ్గుమంటున్నాయి. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి 20 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వినాయక విగ్రహాల తయారీ కోసం వినియోగించే వివిధ రకాల ముడిసరుకు ధరలు, రవాణా చార్జీలు పెరగడంతోనే విగ్రహాల ధరలు పెంచాల్సి వచ్చిందని ధూల్‌పేట్, నాగోల్, మియాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు చెబుతున్నారు. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు సైతం డిమాండ్ పెరిగిందని, ఎక్కువ మొత్తంలో చెల్లిస్తే తప్ప కళాకారులు లభించడం లేదని ధూల్‌పేట్‌కు చెందిన ఒక వ్యాపారి విస్మయం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతేడాది కంటే ఈసారి కొంతమేరకు పెరిగాయన్నారు.

ఆకట్టుకునే ఆకృతుల్లో..

ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం అందమైన వినాయక విగ్రహాలు ముస్తాబయ్యాయి. కొన్ని చోట్ల అమ్మకాలు కూడా ఆరంభమయ్యాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రాంతాలకు చెందిన మండపాల నిర్వాహకులు హైదరాబాద్ నుంచే విగ్రహాలను తరలిస్తారు. ఈ మేరకు ధూల్‌పేట్, ఎల్‌బీనగర్, నాగోల్, ఉప్పల్, కార్వానా, కూకట్‌పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం విభిన్న ఆకృతుల్లో బొజ్జ గణపయ్య మూర్తులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

ధరలు ఎందుకు పెరిగాయంటే..

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కొబ్బరి పీచు, రంగులు తదితర వస్తువుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి ముడిసరుకును హైదరాబాద్‌కు తరలించేందుకు రవాణా చార్జీలు కూడా భారీగా పెరిగాయి. దీంతో విగ్రహాల ధరలను పెంచవలసి వచ్చిందని హస్తకళాకారులు చెబుతున్నారు. సుమారు 500కు పైగా చిన్న, పెద్ద కార్ఖానాలు ఉన్న ధూల్‌పేట్‌లో రూ.500 ఖరీదైన విగ్రహాలు మొదలుకొని రూ.3.5 లక్షల ఖరీదు చేసే విగ్రహాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల సైజులను బట్టి 15 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగాయి.
- గతేడాది రూ.40 వేలకు లభించిన విగ్రహాలు ఇప్పుడు రూ.45 వేలకు పెరిగాయి. 15 ఫీట్ల విగ్రహం రూ.85 వేల నుంచి 1.10 లక్షల వరకు పెరిగింది. ఎక్కువమంది కొనుగోలు చేసే 18 ఫీట్ల విగ్రహాల ధరలు కూడా రూ.2 లక్షలకు చేరాయి.
- చిన్న విగ్రహాలకు సైతం భారీ డిమాండ్ ఉంది. ధూల్‌పేట్‌లోని కళాకారులు ఇళ్లల్లో చిన్న విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటికి రూ.500 నుంచి రూ.2500 వరకు ధరలు ఉన్నాయి. ఈ ధరలకు అనుగుణంగానే వివిధ సైజుల్లో ఉన్న విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు.



కార్ఖానా ఖర్చులు పెరిగాయి



నగరంలో విగ్రహాల తయారీ కోసం కోల్‌కతా, పుణె, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి కూడా కళాకారులను తీసుకొస్తాం. వాళ్లకు చెల్లించే జీతభత్యాలు ఈసారి బాగా పెరిగాయి. విగ్రహాల తయారీ పూర్తయ్యే వరకు భోజనం, వసతి కూడా కల్పించాలి. ముడిసరుకు ధరలు పెరగడం వల్ల కార్ఖానా నిర్వహణ ఖర్చులు కూడా పెరిగాయి.

– గణేశ్

పోటీ కూడా ఎక్కువే



ఒకప్పుడు ధూల్‌పేట్ విగ్రహాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు అన్ని చోట్లా విగ్రహాలను తయారు చేసి అమ్ముతున్నారు. షోలాపూర్ నుంచి తెచ్చి ఇక్కడ అమ్మకానికి పెట్టారు. రూ.లక్షలు ఖర్చు చేసి విగ్రహాలను తయారు చేస్తే ఈ పోటీ వల్ల ఇబ్బందులకు గురికావలసి వస్తుంది. అలాగని నష్టానికి అమ్ముకోలేం కదా.

– రాకేశ్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ప్రశాంత్‌రెడ్డి



మంత్రి కేటీఆర్‌తో నాయకుడు ప్రశాంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా విదేశీ పర్యటనను ముగించుకుని వచ్చిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసినట్లు ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

శంకర్‌పల్లి: ఉరి వేసుకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని టవర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం గ్రామానికి చెందిన పర్వేద మహేశ్వరి(38) భర్త రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో మహేశ్వరి తన కొడుకు, కూతురుతో కలిసి టవర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో నివాసం ఉంటోంది. ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ప్రొటోకాల్ మీరు పాటించరా?

కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న

బడంగ్‌పేట్: ప్రొటోకాల్ పాటించడం లేదని పదే పదే మంత్రి సబితారెడ్డి కార్యక్రమాలను అడ్డుకున్న బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత మీరెందుకు ప్రొటోకాల్ పాటించడం లేదని కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న నిలదీశారు. శనివారం బడంగ్‌పేటలో స్వప్న, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డిలు విలేకరులతో మాట్లాడారు. హెచ్‌ఎండీఏ నిధులతో 4వ డివిజన్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు సైతం చివరిదశకు చేరుకున్నాయి. స్థానిక కార్పొరేటర్‌కు తెలియకుండా షిర్డి సాయిరాం నగర్‌కాలనీలో సీసీ రోడ్డు పనులకు ఎలా కొబ్బరికాయలు కొడతారని ప్రశ్నించారు. ఒక మహిళగా మేయర్ హోదాలో ఉన్న మీరు మరో మహిళా కార్పొరేటర్‌ను ఎలా అగౌరవ పరుస్తారని ఆరోపించారు. మున్సిపల్ నిధులతో సంబంధం లేకుండా సబితారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.26 లక్షల హెచ్‌ఎండీఏ నిధులు మంజూరు చేయించి అత్యవసర పనుల కింద సీసీ రోడ్డు వేస్తుంటే ఎవరికి చెప్పకుండా వచ్చి మేయర్ పారిజాత టెంకాయ కొట్టడాన్ని తప్పుపట్టారు. మహిళా కార్పొరేటర్ ఏరియాకు వచ్చి అవమాన పరిచేలా వ్యవహరించిన తీరు ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవమాన పరిచే సంస్కృతికి తెరలేపారని మేం కూడా ఇలాంటి సంస్కృతి పాటిస్తాం కాస్కో అని హెచ్చరించారు. ఇక నుంచి అడుగడుగునా మేయర్ అనే హోదాకి గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తామని శపథం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ దంపతులు

హెయిర్ కటింగ్ సెలూన్‌పై దాడి



ధ్వంసమైన అద్దాలు, ఫర్నీచర్

షాద్‌నగర్: పట్టణంలోని పరిగి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఢిల్లీ హెయిర్ కటింగ్ సెలూన్‌పై శనివారం కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఇర్షాద్ అనే వ్యక్తి రూ.15 లక్షలు వెచ్చించి సెలూన్‌ను ఏర్పాటు చేశాడు. అయితే, కొంతమంది వ్యక్తులు దుకాణంలోకి ప్రవేశించి రాడ్లు, రాళ్లతో దుకాణంలోని ఫర్నీచర్, అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుడు మహ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ.. బతుకుదెరువు కోసం షాద్‌నగర్‌కు వలస వచ్చి హెయిర్ కటింగ్ దుకాణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, నాయీబ్రాహ్మణ సంఘానికి చెందిన కొందరు వచ్చి తనను దుకాణం తెరవద్దని బెదిరించడంతో పాటుగా వత్తిడి తీసుకొచ్చారని చెప్పారు. తాను నిబంధనల ప్రకారం కటింగ్ సెలూన్‌ను ఏర్పాటు చేశానని అన్నారు. అయినా కొందరు మూకుమ్మడిగా వచ్చి దుకాణంపై దాడి చేశారని వాపోయారు. లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు వివరించారు.

అక్రమ బ్లాస్టింగ్‌ను అడ్డుకున్న పోలీసులు



ఘటనా స్థలంలో వదిలివెళ్లిన బ్లాస్టింగ్ పరికరం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామం సర్వే నంబర్ 51లో ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లును అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అడ్డుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓ వెంచర్‌లో భారీస్థాయిలో పేలుళ్లు చేపడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బ్లాస్టింగ్‌ను అడ్డుకున్నారు. పోలీసులు రావడాన్ని గమనించిన బ్లాస్టింగ్‌కు పాల్పడే వ్యక్తులు పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిర్వాహకుల వివరాలను తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు



నరెడ్లగూడ సమీపంలోని వరి పంట



ఏపుగా పెరిగిన జొన్న

పచ్చందాలు

షాబాద్: ప్రస్తుతం కురుసున్న వర్షాలకు ఎటు చూసినా పొలాలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయి. ఈ దృశ్యాలను శనివారం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. పత్తి, వరి, మొక్కజొన్న, జొన్న పంటలు ఏపుగా పెరిగి మనోహరంగా కన్పిస్తున్నాయి. షాబాద్ మండలం నరెండ్లగూడ, మల్లారెడ్డి, తిర్మలాపూర్, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, హైతాబాద్, మద్దూర్, తాళ్లపల్లి, మన్‌మర్రి, అంతారం గ్రామాలకు వెళ్లే దారిలో పంటలు మనస్సుకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో కాటమయ్య బోనాలు



కద్తాల్: కాటమయ్య బోనాల ఊరేగింపు

కద్తాల్: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం కాటమయ్య బోనాల పండుగను, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఊరేగింపుగా వెళ్లి కాటమయ్య ఆలయంలో నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో చల్లగా చూడాలని ఆలయంలో పూజలు జరిపారు. ఈ సందర్భంగా డప్పుల దరువులు, పోతురాజుల విన్యాసాలు, యువకుల ఆటలతో హోరెత్తింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటయ్యగౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్,గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి,డాక్టర్ రమేశ్, నాయకులు యాదయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.